క్లుప్తంగా

'సర్వాయి పాపన్న పేరు పెట్టడం హర్షనీయం'

జన్నారం: జనగాం జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా కాంగ్రెస్ ప్రభుత్వం నామకరణం చేయడం హర్షనీయమని మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు బాలసాని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం మాట్లాడారు. గోల్కొండ కోటను ఆక్రమించుకున్న వీరుడు, గీత కార్మికుల యొక్క ఆదర్శ ప్రాయుడైన సర్దార్ సర్వాయి పాపన్నను ఈ ప్రభుత్వం గుర్తించడం హర్షనీయమన్నారు. ఎట్టకేలకు సర్వాయి పాపన్న పేరును జనగాం జిల్లాకు పెట్టడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో మోకు దెబ్బ డివిజనల్ అధ్యక్షులు నర్సాగౌడ్, పట్టణ అధ్యక్షులు సతీష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, నాయకులు శంకర్ గౌడ్, రవి గౌడ్ పాల్గొన్నారు.

నేటి నుంచి కొనుగోలు కేంద్రాల సందర్శన

పాతమంచిర్యాల: జిల్లా వ్యాప్తంగా వరిధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన కార్యక్రమం గురువారం నుంచి చేపట్టనున్నట్లు సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి ఒక ప్రకటనలో తెలిపారు. వరి కోతలు పూర్తై ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరినప్పటికీ కొనుగోళ్లు సక్రమంగా జరుగకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, క్షేత్ర స్థాయిలో రైతుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇస్తామన్నారు.

క్రీడా శిబిరం ముగింపు

శ్రీరాంపూర్: సింగరేణి ఆధ్వర్యంలో కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి డీజీఎం(పర్సనల్) అరవిందరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టీ షర్టులను పంపిణీ చేశారు. 25 రోజుల పాటు ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్ బాల్ క్రీడల్లో పిల్లలకు శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ తోట సురేష్ పాల్గొన్నారు.

పోచమ్మకు మొక్కులు

భీమిని: కన్నెపల్లి మండలంలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి బుధవారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పుణ్యస్నానం ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యం వండి బెల్లం, కల్లు శాఖలతో అమ్మవారికి సమర్పించారు. కోళ్లు, మేకలు బలిచ్చి ఇంటిల్లిపాదిని చల్లంగా చూడాలి తల్లి అంటూ వేడుకున్నారు. ఆలయ పరిసరాల్లోని చెట్ల కింద వంటావార్పు చేసుకొని విందు ఆరగించారు.

నిబంధనల మేరకు ధాన్యం సేకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల మేరకు రైతుల నుంచి ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ తెలిపారు. జిల్లాలోని 286 వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 15,886 మంది రైతుల నుంచి 1,15,26 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి చేసినట్లు తెలిపారు. రూ.122.3కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు.

24న విత్తన మేళా

బెల్లంపల్లి: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ఈ నెల 24న విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కోట శివకృష్ణ తెలిపారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, జగిత్యాల వ్యవసాయ పరిశోధన కేంద్రంలో మేళా నిర్వహిస్తారని తెలిపారు. వరి, మొక్కజొన్న, కంది, పెసర, మినుము తదితర రకాల నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

పశువులకు టీకాలు వేయించాలి

దండేపల్లి: పశువులకు జబ్బవాపు, గొంతువాపు టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి వై.రమేష్‌కుమార్ సూచించారు. దండేపల్లి ప్రాథమిక పశువైద్యశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు. మండల పశువైద్యాధికారి ధన్‌రాజ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

చెన్నూర్: పట్టణంలోని పద్మానగర్, కొత్తగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం సీడీపీవో మనోరమ సందర్శించారు. గర్భిణులు, బాలికలకు పౌష్టికాహారం, కోడిగుడ్లు సక్రమంగా అందజేస్తున్నారనే విషయం తెలుసుకున్నారు. అనంతరం సీడీపీవో మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు సమయపాలన పాటించాలని సూచించారు. టీచర్లు, ఆయాలు ఉన్నారు.

రాళ్లవర్షంతో రాలిన వడ్లు..!

- నేలవాలిన వరిపైరు
- జాడలేని పంట నష్టం సర్వే
- పరిహారం అందించాలని అన్నదాతల వేడుకోలు


నేలకొరిగిన వరిపైరు

వేమనపల్లి: వడగళ్ల వాన రైతు నోట్లో మట్టి కొట్టింది. కోతకొచ్చిన వరి పంట రాళ్ల వాన తాకిడికి సగం వరి గింజలు నేలపాలయ్యాయి. పంట నష్టం అంచనా వేసి వరి పంటకు పరిహారం ఇప్పించాలని రైతులు ధర్నాలు చేసినా రైతులకు ఫలితం దక్కలేదు. ఈ నెల 7వ తేదీన మంగళవారం వడగళ్లతో మండలంలో భారీగా 46మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. వర్షం తాకిడికి పొలాల్లోని కోతకు వచ్చిన వరి పైరు నేలకొరిగింది. కంకులకు ఉన్న వరి గింజలు నేలపాలయ్యాయి. యాసంగి సీజన్ మండలంలో సుమారు 3400 ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. అన్ని మండలాల కంటే వేమనపల్లి మండలంలో ఒక నెల ఆలస్యంగా కోతలు మొదలవుతాయి. సుమారు 680 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగినట్లు గ్రామాల వారీగా రైతులు తెలుపుతున్నారు. కానీ అధికారులు మాత్రం కేవలం 180ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా పంపించినట్లు తెలుస్తోంది.

అడ్డు వచ్చిన ఎన్నికలు...

ఇటీవల రాష్ట్రమంతా జరిగిన పార్లమెంట్ ఎన్నికలు వరిసాగు చేసిన రైతులకు శాపంగా మారాయి. ఎందుకంటే అధికారులు ఎన్నికల నిర్వహణలో నిమగ్నమై ఉండటంతో పంట నష్టం అంచనా సమగ్రంగా ఇవ్వలేకపోయారు. నష్టం అంచనాలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి పంపించాలని రైతులు 8, 9తేదీల్లో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాలు చేశారు. రోడ్డుపై బైఠాయించి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. ఎన్నికల నిర్వహణ కారణంగా రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం అంచనా సిద్ధం చేయలేకపోయారు. ఎన్నికల ప్రక్రియ ముగిసి పది రోజులు గడుస్తున్నా, పంట నష్టం అంచనా పంపడం లేదు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వీలైనంత త్వరగా పంట నష్టం అంచనాలు సిద్ధం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సగం పంట నేలపాలైంది



నేను ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేశాను. రాళ్ల వానకు వరిపైరు ఒరిగింది. వడ్లగింజలు భూమి మీద ఎత్తుకునేటట్లు కింద రాలిపోయాయి. ఎకరానికి రెండు ట్రాక్టర్ల వడ్లు వచ్చేది. రాళ్లవానకు వడ్లు రాలడంతో ఒక ట్రాక్టర్ డబ్బా నిండ వడ్లు వస్తలేవు. సగానికి సగం పంట నేలపాలైంది.

- చిగురాల రమేష్, రైతు (వేమనపల్లి)

అప్పులే మిగిలాయి



నేను మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. వానతో కోతకు వచ్చిన పంట భూమిపాలైంది. ఎకరానికి రూ.25 వేలు ఖర్చు చేసినా. పంట చేతికి వచ్చే పరిస్థితి లేదు. అప్పులు మిగిలినయ్. దుకాణంలో ఖాతా కట్టే పరిస్థితి లేదు. అధికారులు సర్వే చేసి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలే.

- సిడాం గంగారాం, రైతు(కొత్తపల్లి)

అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష


మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదన్


హాజరైన టీఏలు, ఎఫ్ఏలు, కార్యదర్శులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని పలు గ్రామాల్లో ఈజీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు, కార్యక్రమాలపై బుధవారం హాజీపూర్ ఎంపీపీ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో మధుసూదన్ ఆధ్వర్యంలో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈజీఎస్ పని ప్రదేశాల్లో తప్పకుండా మంచినీరు, నీడ సౌకర్యం, ప్రథమ చికిత్స బాక్స్ అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతీరోజు ఈజీఎస్ కూలీ కనీసం రూ.300 వేతనం పొందేలా మార్కింగ్ చేసివ్వాలని సూచించారు. నర్సరీల నిర్వహణలో భాగంగా మొక్కల పెంపకం బాధ్యతగా చేపట్టాలని, ప్రతీ బ్యాగులో ఒక మొక్క ఉండేలా చూసుకోవాలన్నారు. హరితహారంలో చనిపోయిన మొక్క స్థానంలో మరో మొక్క నాటాలని ఆదేశించారు. పంచాయతీలోని రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి ఉంచుకోవాలని, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణలో అలసత్వం పనికిరాదని చెప్పారు. పల్లె ప్రకృతివనాలు, బృహత్ ప్రకృతి వనాలను నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. సమీక్షా సమావేశంలో ఎంపీవో శ్రీనివాసరెడ్డి, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ శ్రీనివాసరెడ్డి, టీఏలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

మందమర్రిరూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో రాజేశ్వర్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కూలీలు పనులకు ఎక్కువగా హాజరయ్యేలా చూడాలని, పెరిగిన వేతనాలు కూలీలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధిహామీ సిబ్బంది రిజిష్టర్ పుస్తకాలు ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎంపీవో భీరయ్య, ఈజీఎస్ ఏపీవో రజియా సుల్తానా, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేశ్వర్

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వినతి

మంచిర్యాలటౌన్: పట్టణంలోని సర్వే నంబర్ 140లోని ప్రభుత్వ భూమిలో మంచిర్యాల మున్సిపాలిటీ ప్రకృతి వనం కింద రూ.5లక్షలను ఖర్చు చేసి నాటిన మొక్కలను భూ కబ్జాదారులు తొలగించారని, వారిపై చర్యలు తీసుకోవాలని మంచిర్యాల మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అంకం నరేశ్ బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిలోని స్మృతి వనంను బ్లేడ్ ట్రాక్టర్‌తో పూర్తిగా తొలగించి, ఆస్తి నష్టం చేశారని, సర్వే నంబర్ 283 ఏసీసీలోని సావిత్రి నగర్ కార్మెల్ స్కూల్ వెనక గల ప్రభుత్వ భూమిని కొందరు భూ కబ్జాదారులు ఆక్రమించుకుని ఉన్న బౌండరీలు ధ్వంసం చేసి చుట్టూ ప్రహరీని నిర్మించినట్లు తెలిపారు. దానిపై కూడా చర్యలు తీసుకోవాలని, దీనిపై పూర్తి సర్వే చేయించి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుంకరి రమేష్, శ్రీరాముల మల్లేష్, తాజొద్దీన్ పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నరేశ్

కేసు నమోదు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాళ్లవాగు సమీపంలోని 140సర్వేనంబర్ గల ప్రభుత్వ భూమిలో నాటిన హరితహారం మొక్కలను ధ్వంసం చేసి భూమిని చదును చేశారని, సమాచారం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా, భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లు ఇద్దరు పారిపోయారు. దీంతో రెండు ట్రాక్టర్లను ఇరిగేషన్ అధికారులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇరిగేషన్ ఈఈ రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ బన్సిలాల్ తెలిపారు.

భూమిని పరిశీలించిన కలెక్టర్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని ఆర్ఆర్‌నగర్ వెనుక భాగంలోని 140 సర్వే నంబరులో గల ప్రభుత్వ శిఖం భూమిని కొందరు కబ్జా చేసేందుకు అందులో ప్రకృతివనం కింద నాటిన చెట్లను తొలగించగా, ఆ ప్రాంతాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ బదావత్ సంతోశ్ పరిశీలించారు. రెండు ఎకరాలు గల ప్రభుత్వ భూమి రాళ్లవాగును ఆనుకుని ఉండగా, ఇరిగేషన్ అధికారులకు రెవెన్యూ అధికారులు గతంలోనే అప్పగించారు. ఆ భూమిని కబ్జా చేయకుండా ఉండేందుకు మున్సిపల్ అధికారులు ప్రకృతి వనం పేరిట అందులో మొక్కలను నాటగా, అవి చెట్లుగా ఎదుగుతున్న క్రమంలో, వాటిని జేసీబీ ద్వారా కబ్జాదారులు తొలగించి, చదును చేశారు. దీనిపై పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించిన కలెక్టర్, కబ్జా చేసేందుకు యత్నించిన భూమిని పరిశీలించారు.

ప్రభుత్వ కార్యాలయాల సందర్శన

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలను కేంద్ర అధికారుల బృందం సందర్శించింది. కేంద్ర సెక్రటేరియట్ సర్వీసెస్‌లో అసిస్టెంట్ సెక్షన్ అధికారులుగా(ఏఎస్‌వో) ప్రొబేషనరీ అధికారులు మండలంలోని పాతబెల్లంపల్లి అంగన్‌వాడీ కేంద్రాలు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, ఆకెనపల్లి గ్రామంలోని పశువైద్యశాల, హెల్త్ సబ్ సెంటర్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న సేవలు, పౌష్టికాహారం, హెల్త్ సబ్ సెంటర్‌లో గ్రామీణులకు అందజేస్తున్న వైద్య సేవలను అధికారులను, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఏ తీరుగా చేరుకుంటున్నాయి, వారు ఏ విధంగా లబ్ధిపొందుతున్నారనే అంశాలపై ఆరా తీశారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోలు తీరు, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వ్యవసాయ రంగానికి సంబంధించిన వివిధ సంక్షేమ పథకాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో ఏఎస్‌వో అధికారులు అంకేష్ కుమార్, యోగేష్ యాదవ్, ఆశీష్ శుక్లా, లోకేష్ దివానా, అమన్ గోస్వామి, ఎంపీవో శ్రీనివాస్, పశువైద్యాధికారిణి సుజాత, ఏఈవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


డాక్టర్ సుజాతతో మాట్లాడుతున్న అధికారులు

ప్రెస్‌క్లబ్ అధ్యక్షునిగా సంజీవ్

మందమర్రిరూరల్: మందమర్రి ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నికలు బుధవారం ఏఐటీయూసీ ఆఫీస్ పక్కన గల ప్రెస్‌క్లబ్‌లో జరిగాయి. అధ్యక్షుడిగా గాండ్ల సంజీవ్, ప్రధాన కార్యదర్శిగా కడారి శ్రీధర్, కోశాధికారిగా రాజ్‌కుమార్‌లను ఎనుకున్నారు. పూర్తి స్థాయి కమిటీని త్వరలోనే ఎన్నుకుంటామని అధ్యక్షుడు తెలిపారు. ఎన్నికైన కమిటీ సభ్యులకు ఎన్నికల అధికారులు రవిరాజ్, శ్రీనివాస్, నజీర్ నియామకపత్రాలు అందించగా వారిని ప్రెస్‌క్లబ్ కమిటీ సన్మానించింది.

నల్లబ్యాడ్జీలతో బీజేపీ నిరసన


దండేపల్లిలో ఫ్లకార్డులతో బీజేపీ నాయకుల ర్యాలీ


జైపూర్ తహసీల్దార్ వనజారెడ్డికి వినతి


తాండూర్: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తూ...

- అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్
- ఫ్లకార్డులతో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్లకు వినతులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సన్న, దొడ్డు వడ్లకు ప్రభుత్వం తక్షణమే రూ.500 బోనస్ రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు బుధవారం హాజీపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రైతాంగానికి బీఆర్ఎస్ ఆధ్వర్యంలోనూ తీరని అన్యాయం జరిగిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ హామీల పేరుతో రైతులను మోసం చేయడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజానికాన్ని మోసం చేసిందని ఈ క్రమంలో బోనస్ విషయంలోనూ రైతులను అయోమయానికి గురి చేస్తుందన్నారు. దొడ్డు వడ్లకు కాకుండా సన్న వడ్లకే రూ.500 బోనస్ ఇస్తామనడాన్ని సహించేది లేదని, అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. నిరసనలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు స్వామిరెడ్డి, నాయకులు ధర్మయ్య, వెంకటరమణ, సత్యం, రాజనర్సు, తిరుపతి, స్వామి పాల్గొన్నారు.

దండేపల్లి: ప్రభుత్వం కేవలం సన్నాలకు మాత్రమే బోనస్ అని చెప్పడంపై మండిపడ్డారు. దండేపల్లిలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో నిరసనగా ఫ్లకార్డులతో బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజయ్య, నాయకులు రాకేష్, రవీందర్, శ్రీనివాస్, సురేందర్, గురువయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

జైపూర్: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు దూట రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి అనంతరం ఎమ్మార్వో వనజారెడ్డికి వినతి పత్రం అందజేశారు. దొడ్డు వడ్లకు సైతం బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. తిరుపతి గౌడ్, చంద్రమౌళి, మునిందర్, సతీశ్ పాల్గొన్నారు.

తాండూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ మండల అధ్యక్షుడు భరత్ కుమార్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొశెట్టి విజయకుమార్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి, సీనియర్ నాయకులు చిలువేరు శేషగిరి, తుకారాం, రామగౌని మహీధర్ గౌడ్, మండల ఇంచార్జీ మద్దెర్ల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు పుట్ట కుమార్, మండల కార్యదర్శి సిద్దం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్: మండల కేంద్రంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మోర్ల శంకర్, నాయకులు బత్తుల సమ్మయ్య, శివకృష్ణ, కమ్మల శ్రీనివాస్, వంశీ, కేపీఎం శ్రీనివాస్, రాజు, శ్రీపాల్, రాజశేఖర్‌గౌడ్, శంకర్, పోచన్న, రాజన్నలు పాల్గొన్నారు.

కోటపల్లి: కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ మంత్రి సురేఖ సందర్శించి, అనంతరం రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మహేంద్రనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కందుల వెంకన్న, పున్నంచెందు, రామయ్య పాల్గొన్నారు.

వేమనపల్లి: దొడ్డురకం వడ్లకు సైతం రూ.500 బోనస్ కేటాయించాలని, రైతులు పండించిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు ఏట మధుకర్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, సీనియర్ నాయకులు దుర్గం పుల్లయ్య, బీసీ మోర్చ అధ్యక్షుడు కుబిడె అంజి, ఎస్సీ మోర్చ అధ్యక్షుడు కుర్మ లస్మయ్య , రౌతు సుధాకర్, జాడి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు బోర్లకుంట శంకర్ ఆందోళన చేపట్టారు. సన్నరకం వడ్లకు బోనస్ ప్రకటించేంత వరకు ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఇందులో బీజేపీ మండల ఇన్‌చార్జి ఆలం బాపు, ప్రధాన కార్యదర్శి మాడెం శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కాంటాలో అవకతవకలు'



చెన్నూర్‌రూరల్: మండలంలోని దుగ్నెపల్లి గ్రామంలోని డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో కాంటాలో అవకతవకలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కాంటాలో కిలో మైనస్ పెట్టి చూపిస్తున్నారని, వేరే కేంద్రం దగ్గరి కాంటాను తీసుకొచ్చి బస్తాను పెడితే కిలో ఎక్కువ చూపుతుందని తెలిపారు. అధికారులు స్పందించాలని కోరారు.

దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలి

చెన్నూర్: మండలంలోని సుద్దాల, కాచన్‌పల్లి గ్రామాల్లో గల బీఆర్ఎస్ కార్యకర్తల ఇళ్లలో చొరబడి దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై కేసులు నమోదు చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రాజా రమేశ్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులు బుధవారం సీఐ రవీందర్‌ను కలిశారు. అనంతరం పోలీసు స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు అక్రమంగా ఇళ్లలోకి వెళ్లి దాడులు చేసినా, పోలీసులు పట్టించుకోరా అని ప్రశ్నించారు. దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, రాంలాల్‌గిల్డా, కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, అనిల్, నాయకులు ఆసంపల్లి శ్రీనివాస్, మహిళ నాయకురాలు భారతిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సంక్షిప్త వార్తలు

'ప్రభుత్వంపై చివాకులు పెడితే ఊరుకోం'

జైపూర్: బీఆర్ఎస్ నాయకులు తమ ఉనికి కాపాడుకోవడానికి రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని, బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై అవాకులు, చివాకులు పెడితే ఊరుకోం అని కాంగ్రెస్ పార్టీ జిల్లా డీసీసీ జనరల్ సెక్రెటరీ రిక్కుల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లుగా తెలిపారు. ఫయాజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ స్వాముల పూజలు

భీమారం: శ్రీకోదండరామాలయంలో హనుమాన్ స్వాములు పూజలు నిర్వహించారు.

గొడుగుల పంపిణీ

మంచిర్యాలటౌన్: స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి, లయన్ మెంబర్ వి. మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలోని వీధి వ్యాపారులకు, రోడ్డు పక్కన కూరగాయలు, పండ్లు అమ్ముకునే వారికి బుధవారం గొడుగులు అందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దండేపల్లి: మండల కేంద్రం సమీపంలో ఇటీవల కాల్వలో ట్రాలీ బోల్తాపడి మృతి చెందిన ఉపాధిహామీ కూలీ బంగారు మల్లవ్వ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు బుధవారం పరామర్శించారు. ప్రభుత్వం ఆమె కుటుంబానికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. వైస్‌ఎంపీపీ అనిల్, మాజీ ఉపసర్పంచ్ భూమన్న, నాయకులు రమేష్, రాజమల్లు, మహేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటకు చెందిన ముస్లిం యువకులకు కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కంది సతీష్ బుధవారం క్రికెట్ కిట్ అందజేశారు. సాధిక్, నజీర్, జాఫర్, కాంతారావు, నర్సయ్య, స్వామి, లచ్చన్న, చంద్రయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రామకృష్ణాపూర్: పట్టణంలోని కనకదుర్గా కాలనీకి చెందిన ఆవునూరి వెంకటి ఇటీవల చెట్టుపై నుంచి పడి మంచానికే పరిమితం కాగా నిరుపేదరికంలో ఉన్న అతని కుటుంబానికి రామకృష్ణాపూర్ యువత సభ్యులు రూ.5వేల విలువ చేసే నిత్యావసర సరుకులను బుధవారం అందించారు.

జన్నారం: మురిమడుగుకు చెందిన గల్ఫ్ కార్మికుడు రాజన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి గల్ఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 10 వేలు, కార్మికుల నుంచి రూ. 7,800 బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు.